ఇష్టా యిష్టాలు జనించడానికి కారణాలు కానరావు. జనించిన భావాలు ఒక పట్టాన తొలగిపోవు. ఆశ అంతరించినా అభిమానానికి పాత్రమైన వ్యక్తి ఛాయలు కనిపించితే చాలు, యిష్టమే ఏర్పడుతుంది. దానిని ఎదుటివాడు అపార్థం చేసుకొనరాదనుకొనడం మాత్రం వ్యర్థం.

**సెలవులు** యిచ్చి వారం పది రోజులై ఉంటుంది. ఇంటికి వచ్చాము. ఏమీ తోచడం లేదు. నా క్లాసుమేటు ఒకడు—రామ్మూర్తి అని—ఉన్నాడు కాని ఏదో క్యాంపుకంటూ వెళ్లాడు. ఈ రోజే ఉత్తరం వ్రాశాడు, నాలుగు రోజుల్లో వస్తే రావచ్చును అని. అది ముఖ్యంకాదు కానీ అనుకొన్న చోటునుండి ఉత్తరం రాలేదు. ఏమిటో ఆదుర్దాగా, ఆకాంక్షగా ఉన్నది. మనస్సు ప్రశాంతంగా లేనప్పుడు తటస్థించే సన్నివేశాలన్నీ ఎందుకో అంత కలవరం కలుగజేస్తాయి; కొంచెం స్తిమిత పరుచుకొందాం ప్రకృతిని చూసైనా అనుకొంటూ కాలువ గట్టుకు బయలుదేరాను.

(తరువాయి 52 వ పేజీలో)



కాలువలోని నీళ్లు నిర్మలంగా ప్రవహిస్తున్నాయి సన్నని గలగల మోతతో. అల్ప విషయాలనే అలలు విధి అనే ఒడ్డుకు తగిలి ఛిన్నాభిన్నమైపోతున్నాయి. ప్రక్కనే మొలిచినతుంగమొక్కలలస్థితి చూచే కాబోలు కదులుతూ నవ్విన ట్లనిపించింది. ఆశ, జిజ్ఞాస లేని జలప్రాణులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి నీటిలో. ఈ నిరాడంబరమైన ప్రకృతిని చూడగానే ఎందుకో మనసుకు దిగులు ఆవహించింది. ప్రకృతిలోని అంత పవిత్రత, పరిశుద్ధత మనస్సులో లేవనే శంకవల్ల కావచ్చు; మానవ జీవిత లోపాలను ప్రతిబింబింపజేస్తాయనే భావనవల్ల కావచ్చు. ఈ భావాల ప్రకంపనలో నే మండగానె ఉలిపిరి కాయితం లాంటి మనస్సు ఇంకోగమ్యం మార్చింది. ఏముంది! పల్లె పడుచులు ఉల్లాసంగా కేరింతలు కొడుతూ నడుస్తున్నారు. మందంగా, మత్తుగా, చలాకుగా, గర్వంగా వారి అవయవాల చిరు కదలిక చూపులకు హుషారైన తృప్తి నిచ్చింది; ఏవో మధుర భావాలకు శక్తి నిచ్చింది; ఒక స్వరూపాన్ని మనస్సులో నిలబెట్టింది.

రాజేశ్వరి—కాదు, నా హృదయేశ్వరి—మనసు కన్నుల తెరలలోపల, హృదయ దర్పణ మధ్య భాగాన, ఊహల మోహపు పాశాల పరిష్వంగంలో కదిలింది.

రాజహంస వయ్యారపు నడక నాకు తెలియదు కాని రాజేశ్వరి నడక మహా బాగుంటుంది. అమావాస్య చీకటిని పిండిన నలుపుకన్నా ఆమె శిరోజాల నీలం మిన్న. గీత వంకరగా ఉంటుందని నేనను గానీ ఆమె నడతలోనూ వక్రత కనుపించదు. నమ్రత ఆమెసొమ్ము. నిరాడంబరభూషణప్రాయమే. అన్నిటికన్న ముఖ్యంగా అగాధ భావపరంపర ఆమెకు నిజంగా అలంకారం. ఆమెమీద గల ప్రత్యేకమైన అభిమానంలో అనుకొంటున్న మాటలు కావు. కళాశాల విద్యార్థులందరకూ తెలిసిన విషయమే!

అయితే విద్యార్థుల్లో దాదాపు చాలమంది ఆమెను రాజేశ్వరి అని కాదు అనేది; 'రాజయోగిని' అని. అపరిహాసపాత్రమైన పేరు ఆమె చెవులబడక పోలేదు. కాని ఆమె ఒక్క చిరునవ్వు, ఒక్కటంటే ఒక్కదానితో కొట్టిపారేసింది. విద్యార్థిబృందం ఆమె ఓర్పుకు విస్తుపోయింది. ఆమె సంకల్ప శక్తికి ఆశ్చర్యపడ్డాను సౌందర్య సాగరంలో మగ్నమైపోయిన నేను. ఆమె నా క్లాసుమేటు అయినప్పటికీ మాట్లాడవలసిన అవకాశంకాని, అగత్యంకాని కలుగలేదు అప్పటివరకు.

ఈ విధంగ నెలలు గడిచాయి. వార్షికోత్సవాలు సమీపించాయి. ప్రతి విద్యార్థీ తల మునక లయ్యే పనిని వహిస్తున్నట్లు భావించుకొనేవాడు. రంగు కాగితాలు కత్తిరించడం, సభా ప్రారంభకులను, ఉపన్యాసకులను ఆహ్వానించే కార్యభారాన్ని వహించడం, రంగాలంకరణ — ఇత్యాది కార్యకలాపాల్లో మగ్నమయ్యారు.

వార్షికోత్సవం రేపనగా ప్రార్థన గీతాన్ని పాడవలసిందిగా కార్యదర్శి, విద్యార్థినులను అడ

# ఎండమావులు

( 8 వ పేజీ తరువాయి )

గటం జరిగింది. విద్యార్థినులందరూ రాజేశ్వరి పాడుతుందని చెప్పారు. బలవంతాన రాజేశ్వరి ఒప్పుకున్నది. విద్యార్థినులు ఆమె నైపుణ్యాన్ని పరీక్షించి ఆమెను పాడమన్నారో లేదో మరి తెలియదు.

సభా ప్రారంభం రోజున రాజేశ్వరి ప్రార్థన గీతం పాడుతుందనగానే విద్యార్థు లందరూ గోలచేసిన మాట వాస్తవమేకానీ తర్వాత పాపం నొచ్చుకొన్నారు.

ఎవరనుకొన్నారు రాజేశ్వరి అంత మనోజ్ఞంగా పాడగల్గునని? రాణిరగించే విమల గాంధర్వ విద్య ఆ గాంధర్వ కన్యకు సహజమేనని నేననుకొన్నాను ఆ సమయంలో. ఆమెను గురించి కలవరించే నా మనస్సు ఇంకో మెట్టు ఎక్కింది. ఆ నాలుగు నిమిషాలలో ఆమె కంఠంలోని సంగీత లత తీవెలు తీవెలుగా, అలలు అలలుగా హృదయాలను పెనవైచుకొన్నది. నిస్తబ్దమై, ప్రశాంతమై, అనిర్వచనీయమైన ఆనందంలో మునకలు వేసింది సభ. ప్రతివారి కన్నుల్లో ఆనంద బాష్పాలు జాలువారాయి. ఎవరో మహాకవి చెప్పినట్లు—మనోహర సౌందర్యంలో సమస్త విద్యలూ కేంద్రీకరింపబడతాయి అనే మాట స్ఫురణకు వచ్చింది నాకు.

ఆ రోజున నేను మొట్టమొదటి సారిగా అభినందించడానికి వెళ్లాను. అనేకులు ఆమెను చుట్టుకొని ప్రశంసిస్తున్నారు. చివరకు ఎలాగైతేనేమి, నేను వెళ్లాను. అప్పుడు రాజేశ్వరి నన్ను అదాటుగా చూచి భయకంపిత అయ్యింది. కారణం నాకు బోధపడలేదు. తర్వాత నేను ఆమెను అభినందించాను. ఆమె కాటుక నయనాల్లో నీళ్లు చిప్పిలినాయి. అవి ఆనందబాష్పాలని నే నను కొన్నాను. ఆమెమాత్రం మృదువుగా "థ్యాంక్సు" అంది. నేనెంతో పొంగిపోయాను.



ప్రకృతి పరిశీలనం
ఫోటో — జగం (బాపట్ల)

ఉన్నత పర్వతం చెంత ఉన్నట్లనిపించింది నాకు. కొద్దిసేపయిన తర్వాత తిరిగి వచ్చాను. రాజేశ్వరి వెనుకనుండి నన్ను చూసినట్లు నా భావన.

అదిమొదలుగా అనేక పర్యాయాలు కలుసుకొన్నాము. ఆమెలో ఏదో నిసూత్న చైతన్యం కలిగినట్లు కనిపెట్టగలిగాను. ఒక పడుచు ఎద లోని అంతర్యాన్ని ఇంకొక పడుచువ్వాడయితే గ్రహించగలగడంలో ఏమంత గొప్పతనం లేదు. నేనంటే ఆమెకు ఇష్టమని, నేనామెను ప్రేమిస్తున్నానని నా మనస్సు చెబుతున్నది. దానికితోడు ఏదో ఉత్సాహం, ఉత్కంఠ ఆమె మనస్సులో చెట్టాపట్టాలు వేసుకొన్నాయి. ఒక విషయం మాత్రం నా మనోవీథిలో ముక్కుమీసుక్కులా మెదలుతూంది—రాజేశ్వరి ఎందుకుఒక్కోసారిఏదో భావోద్విగ్నతతో వివశమైపోతుంది? ఎందుకుఆధ్యాత్మిక భావపరంపరతో సమాధిస్థితిగతురాలైన, ముక్తసంగురాలైన ఋషిలా వైరాగ్యముద్ర? ఈ భావశబలతకు కారణం ఏమిటి? — అని. ఈ ప్రశ్నలు ప్రశ్నల్లా ఉండిపోయాయి. అథవా ఆలోచించినా కుటుంబ పరిస్థితుల ప్రాబల్యమో, ఇతరమైన కారణాలేమో నని సమర్థించుకొనే వాడిని. అది సమన్వయం మాత్రమే!

ఈ విధంగా నాలో నేను వితర్కించుకొన్నాను. కాని రాజేశ్వరిని అడగడానికి సాహసించలేదు. అంతేగాక ప్రణయ ప్రాథమిక దశ ప్రశ్నించనివ్వ లేదు. మొత్తంమీద ఆమె నన్ను ప్రేమించానని వ్యక్తంచేసినట్లనిపించింది. కాలేజ విద్యార్థులు నా అదృష్టాన్ని వేనోళ్ల ప్రశంసించారు. కొంత మంది ఈర్ష్యాళువులు దుష్ప్రచారం చేశారు. అంతేకాదు; కుడ్యాంమీద మషీరసంతో కాదుగానీ మసిబొగ్గులతో మా యిరువురి నామాలు లిఖింపబడ్డాయి. మా సన్నిహితత్వం మాత్రం నైతికపుపరిహద్దుల్లోనే ఆకాశహార్మ్యాలనిర్మించు కుంది.

నిజం చెప్పవలసి వస్తే నన్ను నేను అభినందించుకొన్నాను అహంబ్రహ్మాలా. అటువంటి అందాలరాశి, సుగుణఖని—ఏ నా పురాకృత పుణ్య వశాన పరిచయం అయిందో అని ముదితాంతరంగుడ నయ్యేవాడను ప్రబంధ నాయకునిలా. చివరకు జీవితభాగస్వామిగా ఎంచుకొన్నాము నాలో నేను.

పరీక్షలు అయ్యాయి. ఆమె ఇంటికి వెళ్లే రోజున నేను కలుసుకొన్నాను. నా హృదయగతమైన అభిప్రాయాన్ని వెల్లడించాను. రాజేశ్వరి ఒక దీర్ఘ నిశ్వాసాన్ని విడిచి, సిగ్గుతో అవనతముఖి అయింది. మనసు పులకాంకురమైంది మధుర భావాలతో. సిగ్గుతో కందిపోయిన కపోలాలతో ఎంత అందంగా ఉంది రాజేశ్వరి! నేను ఆమె హస్తాన్ని, నా హస్తంతో స్పృశించాను. వణికి పోయింది రాజేశ్వరి. ఇంటికి వెళ్లి సావకాశంగా విచారించి, ఉత్తరం వ్రాయడమో లేక రావడమో చేయమన్నది. ఆమె ముందు ఉత్తరం వ్రాసిన తర్వాత నన్ను ఉత్తరం వ్రాయమన్నది. విచార రేఖల కంగలుపుతో కూడిన ఆలోచనలతో రాజేశ్వరి

వెళ్లిపోయింది. కారణం ఏకాని ఇంతవరకు ఉత్తరం వ్రాయలేదు. కారణాల అన్వేషణలో ఉన్నాను. మనస్సంతా వికలంగా ఉంది. ఈ ప్రపంచంలో నేనొక్కణ్ణే ఏకాకిని—అనే స్థితిలో ఉన్నాను.

సూర్యుడు చరమగిరిమీద వాలిపోయాడు. అతడు అస్తమిస్తూ యిచ్చిన బహుమానాలను మేఘకన్యలు ధరించినట్లుగా వివిధ వర్ణాలు పశ్చిమ దిగ్భాగాన పొడసూపాయి. నేను యింటికి బయలుదేరాను. పొలాల్లో నుండి కమతగాండ్ల సంతోష తరంగితమైన కంఠనాదాలు గాలిలో తేలితేలి వస్తున్నాయి. వాళ్లంటే నాకొక విధమైన ఆనందం, అసూయ కలిగాయి. నిర్భర సంతోషంతో ఉన్నారని ఆనందం; చీకుచింతలు, అనుభూతులు, ఆవేగాలు లేవే అని అసూయ. వెంటనే నాకున్న మానసికబాధలు ఎదుటివాళ్లకు లేవని ఈర్ష్య పడడం ఏమిటి? మనస్సుకు ఎంత వ్యసనం! అనిపించి నవ్వుకొన్నాను.

ఈ ఆలోచనలతో ఇంటికి వెళ్లాను. ఊరు నుండి వచ్చిన మా అమ్మ నాకోసం అరుగుమీద కూర్చొని ఉంది. నన్ను చూడగానే ఎంతో సంబరపడింది. వాత్సల్యంతో తన్మయమయ్యింది. నేను ఒక్కణ్ణే కొడుకును ఆమెకు. ఆమె ఒక్కతే నాకు. నా మనస్సులో తృప్తి నిండి కన్నుల్లోనుండి నీరుగా పొంగిపోయింది.

"నాయనా! బాగున్నావా? పరీక్షలు బాగా వ్రాశావా? ఈ ఏడాదితో చదువు అవుతుంది కదూ?" అన్నది. సమాధానం చెప్పాను. సంతోషించింది.

నా మాటలు విని మామ్మ బయటకు వచ్చి "ఏరా, నాయనా, ఎంతసేపురా షికారు? మీ అమ్మ నీకోసం గంటన్నరనుండి కాచుకొని ఉంది అరుగుమీద. నేనుమాత్రం కళ్లు కాచేటట్లు చూస్తున్నా. స్నానం చేయి. నీకిష్టమైన దొండకాయ వేపుడు చేశాను" అంటున్నది. మా అమ్మ, నేను సర్వస్వంగా భావించిన మామ్మ వాత్సల్యం మాట్లాడుతున్నదని నాకు తెలుసు.

మా అమ్మ, నేను చిన్నగా నవ్వాం. ఆమె ఆర్ద్రతను చూపి.

"నవ్వు నాయనా! మీ అమ్మ వచ్చిందిగా, ఇక ముసలిదానితో నీకేం అవసరం" అన్నదిమామ్మ. ఆమె ఒక్కతే నన్ను గురించి జాగ్రత్త తీసుకోవాలనే ఉద్దేశ్యం ఆమె మాటల్లో వ్యక్తమయింది.

"మామ్మా! మా అమ్మ రాకపోతేమాత్రం నీతో అవసరం లేకపోతుందటే? నువ్వు ఒకటి, అమ్మ ఒకటీనా?" అన్నాను నేను.

"మా నాయనే—మా నాయనే" అని మురిసిపోయింది మామ్మ. లోకంలో వాత్సల్యంకోసం ఆప్యాయతకోసం ఎంత తహతహ అనిపించింది. స్నానం చేసి భోజనం చేశాను. ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాను. ఆ పేజీల్లో రాజేశ్వరి కనిపించింది. చదవడం మానివేశాను. మనసులో మధురమైన ఆలోచనలు పొరాడుతున్నాయి.

అమ్మతో యీ విషయం చెబుదామా? అనుకొన్నాను. ఎందుకో అంతరాత్మ సిగ్గు పడింది. మొన్నటివరకు అమ్మ మాటల్లో నడిచిన నేను ఏ విధంగా స్వయంగా నా ప్రేమగాథ చెప్పాలి—అని సంశయ పడ్డాను. ఒక్కటిమాత్రం యదార్థం. సక్రమం, సమంజసం అనుకొన్నదాన్ని ఈ భూప్రపంచంలో దేన్ని కోరినా అమ్మ వారించదు. ఎందుకంటే ఈ ప్రపంచంలోనూ ఆమెకు నేనొక్కణ్ణే గనక సక్రమం కానిదాన్ని కోరినా ప్రమాదం లేదు, ఆమె ఒప్పుకొంటుంది; కానీ బాధపడుతుంది. ఆమె బాధ నాకు రంపపు కోత.

నేను అడగ దలచుకొన్న విషయం మంచిదే గనక అమ్మతో జరిగిన సంగతి చెబుదాం అనుకొన్నాను. కానీ మనసులో ఏదో ధైర్యానికి అడ్డు పడింది. ఈ విధంగా నేను ఆలోచనలతో కుస్తీ పడుతుండగా అమ్మ వచ్చి మంచం దాపున చాప మీద కూర్చున్నది.

"నాయనా! మొన్న వెల్లటూరు కూడా వెళ్లాను. బాబాయిగారు నిన్ను ఒక్కసారి రమ్మన్నారు. సుందరరామయ్య బాగానే ఉన్నాడు. అన్నట్లు రాఘవయ్య మామయ్య కూతురు పార్వతి భర్త చనిపోయాడురా. నెల పదిహేను రోజులైంది. పెళ్లయి నిండా మూడేళ్లన్నా కాలేదు. దేవుడు ఆ అమ్మాయి పసుపు కుంకం తీశాడు. కర్మ ఎవరికి ఎలా రాసిపెట్టి ఉందో అట్లు జరగాలి. పార్వతి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. అత్తయ్యా! నా గతేమయిందో చూడు అత్తయ్యా!అని ఏడిచిపోయిందిరా పిల్ల. బంగారం లాంటి పిల్ల. నువ్వు మొదట్లో దాన్ని చేసుకోను అన్నావు. అప్పుడు నిన్నేచేసుకొంటానని మారాం చేసింది, పిచ్చిపిల్ల. ఈనాశే యింటికి వచ్చింది. రాఘవయ్య మామయ్యగారింటికి వెళ్లలేదూ?"

సమాధానం చెప్పకుండానే దిగ్భ్రమ చెంది పోయాను. పార్వతి భర్త చచ్చిపోయాడు. పద్దెనిమిది వసంతాలు నిండీ నిండని పార్వతికి ఇక దుర్భర వైధవ్యం! భగవాన్! నీ అర్థాంతర లీలకు పరమార్థం ఏమిటి స్వామీ! సమాప్తంకాని జీవిత నాటక రంగంలో పాత్రను రంగస్థలంమీదనుండి బలవంతంగా లాగడం న్యాయమా దేవా!-అనుకొన్నాను.

అయితే నా మనస్సే నన్ను బెదరించింది—నువ్వేగనక చేసుకొనిఉంటే ఈస్థితి జరుగదేమో? ఒక విధంగా నువ్వే ఆమె అనాథ స్థితికి కారణం—అని.ఏదో మహాపర్వతం తలమీద ఉంచినట్లయింది. నా కారుణ్యం అనే బలహీనత ఆవిధంగా అనిపించింది. కానీ ఒకవేళ నేను చేసుకొంటే మృత్యువు నాకు బంధువయ్యేదా? పార్వతికి కాక పొయ్యేదా?

ఏమైనా నా మనస్సుకు తూట్లు పడ్డాయి. కాలేజీలో చేరాలనే సంకల్పంతో పార్వతిని పెండ్లి చేసుకోవడానికి అంగీకరించని నాటి సంఘటన స్ఫురణకు వచ్చింది. చిన్న పిల్లల అనుభూతిలా అనిపించింది. మరిచిపోయిన కల జ్ఞప్తికి వచ్చినట్లనిపించింది. మనస్సు ఊసరవెల్లిలా రంగులు మారుస్తుందేమో అనే సందేహం కలి



భారం ఎవరికి?

ఫోటో—డి. రవిప్రసాద్ (విజయవాడ-2)

గింది. అయినా జీవితాలకు తెలిసినప్పుడు గాని, తెలియనప్పుడు కానీ ఆశల, ఆశయాల సఫలత మృగతృష్ణల తుల్యం అనిపించింది. ఏమిటో చిక్కిరి బిక్కిరిగా మనస్సు అనే సాలెగూటిలో తెగిన తంతుల్లా ఆలోచనలు కదిలాయి.

"అ...మ్మా!" నెమ్మదిగా పిలిచాను.

"ఏం నాయనా?"

"అనుకొన్నవన్నీ జీవితంలో చేయడం మంచిదా అమ్మా?"

"మంచివి అనుకొన్నవన్నీ చేస్తే మంచిదే బాబూ!"

"అన్నీ చేయలేకపోతేనో?"

"చేయగలిగినవే చేయవచ్చు."

"చేయడానికి విధి ఎదురైతే, ఎలాగమ్మా?"

"ఫలితం విధికే వదలవచ్చు." అనుభవం మాట్లాడుతున్నది.

"భారం.... మనం భరించాలి కదమ్మా. మరి?"

"అంతే!"

"గత్యంతరం?"

"లేదు." కొన్ని నిమిషాలు గడిచాయి. మనస్సు తెకతెకలాడుతున్నది.

"అమ్మా!"

"ఆఁ ఏం, నాయనా!"

"ఏం లేదమ్మా—మరి, నేను.... ఊఁహుఁ... రేపు మాట్లాడతాను. ఏమీ లేదు. రేపు రాఘవయ్యగారి ఇంటికి వెళ్లొస్తానమ్మా!" అనుకొన్నదాన్ని చెప్పలేకపోయాను.

"సరే. నిద్రపో" అన్నది అమ్మ తలుపు దగ్గరకు వేసి అవతల గదిలోకి వెళ్తూ.

నాకు నిద్ర పట్టలేదు. ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. మూసుకొన్న కన్నుల్లో కనబడిన భ్రాంతిలో ఒక వైపున రాజేశ్వరి; మరొక వైపు పార్వతి. పార్వతి పైకిలేచి మాయమైపోయింది. రాజేశ్వరి సమీపించి దూరమైపోయింది. నిద్రపోయాను.

మరునాటి రోజు సాయంత్రం పార్వతి వాళ్ల యింటికి వెళ్లాను. ఇంట్లో దుస్సహమైన

ప్రశాంతి తాండవిస్తున్నది. లోపలికి అడుగు పెట్టాను. పార్వతి మంచంమీద పడుకొని ఉన్నది ముభావంగా. వాళ్లఅమ్మ ప్రక్కనే కూర్చున్నది దిగులుగా. ఒక్కక్షణం నిశ్చేష్టుడనైపోయాను.

అంతలో "రా నాయనా! శంకరం" అన్నది అత్తమ్మ. ఆమె గొంతు బొంగురుపోయి ఉన్నది. పార్వతి నన్ను చూసి గబగబా లేచి ముసుగు వేసుకొని క్రింద కూర్చున్నది. నేను మూగ బొమ్మలా కూర్చున్నాను. ఎలా మాట్లాడాలో తోచలేదు. ఎందుకువచ్చాను ఈ విషాద పరిచ్ఛిన్న వాతావరణం లోనికి అనుకొన్నాను మనసులో. అనునయించగలనా మరి వారి అగాధ దుఃఖాన్ని?

అత్తమ్మ కన్నుల్లోనుండి నీళ్లు ఉబుకుతున్నాయి. పార్వతి మనోద్వారాల్ని తెరచుకొని దుఃఖం పొరలి పొరలి వస్తున్నది. హే! భగవాన్! ఈ అనంత శోకాక్రాంత పరిస్థితిని ఎట్లా ఉపశమింపజేయాలి? అనుకొన్నాను.

"మా జీవితాలు... ఇలా అయ్యాయి... చివరికి ...ఒక్కగా నొక్క కూతురు... అనుకొన్నాం. .. దీని జీవితం ఇట్లా తెల్లారిపోయింది. ఇక గుండెల్లో కుంపటిలా జీవితకాలం భరించాలి. దేవుడు మాకు చావు ఎందుకు ఇవ్వలేదు? వాడెంత కర్కోటకుడు? చూస్తూ చూస్తూ పసిదాని నల్లపూసలకు వెలితి కలిగిస్తాడా?" అని ఉబుకుతున్న దుఃఖంతో బావురు మన్నది.

"అమ్మా" అని పార్వతి తల్లిమీద పడి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. ఆ కరుణాకలిత సన్నివేశంలో గుండెలోని ఆర్తుతలా కన్నుల్లో నీరు సుళ్లు తిరిగింది. నాకూ, వీళ్ల దుఃఖానికీ సంబంధం లేదు కదా?-అనుకొన్నాను. ఏమైనా వాళ్లను ఓదార్చవలసిన భారం నామీద ఉన్నది; తప్పదు అనుకొని—

"ఊరుకోండి అత్తమ్మా! తెలిసినవాళ్లే ఇలాబెంబేలుపడితే పార్వతిని ఎవరు ఓదారుస్తారు? మనం ఏం చేయగలం? కష్టాలు మనుష్యులకు రాక ఎవరికి వస్తాయి? దిగమింగడంకన్నా ఏమీ చేయలేము" అన్నాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. మూగగా ఏడుస్తున్నది. పార్వతి మంచం పట్టెమీద తల ఆనించింది. నాకు మాట్లాడడానికి ఇంకా ఏమీ తోచలేదు.

"కాఫీ... పెట్టి తెస్తా ఉండు నాయనా" అని లోపలికి వెళ్లింది అత్తమ్మ.

ఇప్పుడు చూశాను పరీక్షగా పార్వతిని. అది వరకు లాగా ముఖాన కొట్టవచ్చే కుంకుమ రేఖ లేదు దైన్యం తప్ప. ఒంటిమీద తెల్లని చీరె. చేతికి అల్పమైన ఆశల్లాగా రెండు బంగారు గాజులు. కన్నుల్లో బాధాదృష్టుల ప్రసారం— స్ఫుటమై పరిపూర్ణత చెందిన శరీరావయవాల సౌందర్యశోభ. అబ్బా! ఈ శోకమూర్తికి,వెనుకటి సుందరమూర్తికి ఎంత భేదం! ఆశలు దుమ్ము కొట్టుకొని పోయిన నిస్సార, నిర్జీవ ప్రతిమ! నేనామెను చూడలేక కన్నులు మూసుకొన్నాను. పార్వతే మాట్లాడింది.

"నన్ను చూడడానికి వచ్చావా? బా....వా?"

# ఎండమావులు

ఏ సమాధానం చెప్పాలి ఊహించని ఆ ప్రశ్నకు? నేను ఏం చెప్పాలి అని పార్వతి కోరిక?

నేను పిచ్చిగా పార్వతివైపు చూశాను. అదే నా సమాధానం.

"నా పెళ్లయిన తర్వాత... ఇదే రావడంకదూ. బా...వా?" ఆ మాటల్లో ఎంత బరువు? ఎంత బాధ కొట్టుమిట్టాడిందో కాని ఏం ప్రశ్న అది? నా పాలిటి అంకుశంలాంటి ప్రశ్న! నేనేం సమాధానం చెప్పాలి? ఏ సమాధానం చెప్పాలి? అసత్యాన్ని రూపకల్పన చేస్తే ఎట్లా ఉంటుంది? మౌనం ఉత్తమం అనిపించింది నాకు ఆ తరుణంలో.

మౌనం వహించాను. అది నా రెండవ సమాధానం.

"మాట్లాడవేం బావా?. . . కనీసం మాట్లాడడానికి కూడా నోచుకోలేదా నేను... చివరకు ఎంత దౌర్భాగ్యురాల్నయిపోయాను , బావా?" ఆమె గొంతు గద్గదికమైంది. నా మనస్సు ఎంత మథన పడిందో ఎలా చెప్పేది?

"ఏం ప్రశ్నలు పార్వతీ? నీతో మాట్లాడడానికేగా వచ్చింది..."

"జీవచ్ఛవంతోనా..." రుద్ధమైంది కంఠం.

"ఏం మాటలు పార్వతీ... ఊరుకో... నీతో మాట్లాడుదామని, ఓదార్చుదామని వస్తే ఏమిటీ మాటలు..." బాధగా అన్నాను.

"ఓదార్పు... దానివల్ల ప్రయోజనం లేదు బావా. అయినా ఓదార్పు అనేదాన్ని తారుమారు చేశావు బా..వా!" విట్టూర్పుతో అంది.

"అంటే?"

"ఏమీ లేదు గానీ నేనంటే నీకు ఇష్టం... అంటే...... అభిమానం. అందుకనేగా బావా... వచ్చింది నువ్వు....అవునా?" పెళ్లయిన తర్వాత ఆడవాళ్లకు లౌకికజ్ఞానం తెలియడం అంటే ఏమిటో నాకు తెలిసింది.

"దాన్ని తెలుసుకోడం వల్ల ఏం ప్రయోజనం పార్వతీ!" కుమిలిపోతూ అన్నాను.

"సమాధాన ద్రవ్యంతో మనస్సులో వ్యాపారంచేస్తే 'తృప్తిలాభం' మిగులుతుంది బా..వా!" హిస్టీరికల్‌గానవ్వింది. 'అమ్మో పార్వతీ? ఓడిపోయాను నేను' అనుకొన్నాను. మాట్లాడలేదు.

"సరేగాని బావా! నా గొడవే సరిపోయింది. నువ్వన్నా బాగున్నావుగా, బావా... ఏం మాట్లాడదామని వచ్చావు? కథలు చెబుతావా? గాథలు చెబుతావా?" పార్వతి జ్ఞాపకశక్తికి జోహారులు సమర్పించాను. పూర్వం నేను పార్వతికి కథలు చెప్పేవాడిని. ఈ మాటలతో నా మనస్సు వికలమైంది.

"ఈ ఏడన్నా పెళ్లి చేసుకొంటావుగా... బి.ఏ. చదివిన అమ్మాయినేగా... నన్ను పిలుస్తావా బా...వా" అన్నది. ఎంత నిగూఢంగా మాట్లాడుతున్నావు పార్వతీ అనుకొన్నాను.

"పెళ్లంటూ జరిగితే... నిన్ను తప్ప ఎవర్ని పిలుస్తాను పార్వతీ?"

"పెళ్లంటూ... ఏమిటి బావా...అపశకునం!"

"నేనూ మానవమాత్రుణ్ణేగా... పార్వతీ!"

పార్వతి మాట్లాడలేదు. ఏమో ఆలోచిస్తున్నది. ఆ ఆలోచనాభంగిమ నాకు రాజేశ్వరిని స్ఫురణకు తెచ్చింది. అంతలో అత్తమ్మ కాఫీ తీసుకొని వచ్చింది. కాఫీ తాగాను.

"వస్తాను అత్తమ్మా! మామయ్య ఇంకా రాలేదా?" అన్నాను.

"నువ్వు రాబోయే ముందే పొలం వెళ్లారు. ఆలస్యం అవుతుంది నాయనా."

"వస్తాను పార్వతీ! మళ్లీ కనబడతాను" అని బయటకు వచ్చిపడ్డాను. పార్వతి గుమ్మందాకా వచ్చింది. వెనుతిరిగి చూశాను. పార్వతి పమిటతో కన్నులు తుడుచుకొంటున్నది. ఎందుకు తిరిగి చూశానా అనుకొన్నాను.


చీకటి తెరలు దైన్యంగా లోకాన్ని కమ్ముకొంటున్నాయి. చుక్కలు ధైర్యంగా నిక్కి చూస్తున్నాయి. నా మనస్సులో ఆందోళనలు పరివృతమవుతున్నాయి.

బాల్యస్మృతులు ఒకటొకటిగా తరంగాల్లాగా కదులుతున్నాయి. ఆ నాటి జ్ఞాపకాలు పార్వతి బాగా గుర్తు పెట్టుకొన్నది. ఏమిటి లాభం— అన్నది మనస్సు. పార్వతి మనసులో నేనంటే ఇంకా మమతలు చావలేదు. అవి నా హృదయాన్ని పరివేష్టింపబోతున్నాయి.దానికిఆశ్చర్యమేముంది? వృద్ధిపొందుతూ వృద్ధిపొందుతూ వచ్చిన వృక్ష శాఖలో విభాగమైన రెండు కొమ్మలం మేము. ఒక కొమ్మకు రెమ్మలు వేశాయి. ఇంకొకదానికి రెమ్మలువేసి రాలిపోయాయి. మంచి కొమ్మ, రెండవ కొమ్మకు సహాయం చేయగలదా? ఏమన్నా చేస్తే వృక్షం చేయాలి గాని!

ఇప్పుడేమీ లాభం లేదు. చెదిరిన కల మరలా రాదు. ఒక చీకటియుగం గడిస్తే గాని హృదయ జలజం వికసించదు అనుకొన్నాను.

వెంటనే నా హృదయంలో రాజేశ్వరి ప్రత్యక్షమైంది. ఆలోచనకు హుషారెక్కింది. ఇంటికి వెళ్లాను. అమ్మ ఏవో మామయ్యగారి ఇంటి సంగతులు అడిగింది. చెప్పాను. రాజేశ్వరివిషయం చెబుదా మనుకున్నాను. కాని రెండు మూడు రోజులు ఆగుదాం అనిపించింది.

(సశేషం)



జుమా మసీదు (ఢిల్లీ)
ఫోటో —డి. రాజగోపాలం (బరంపురం)